# పేపరు

శాంతకుమారి ఏడేళ్ళ ముద్దుబాల. ఆమె చేసే చేష్టలూ, పలికే పలుకులూ, నడిచే నడకలూ హృదయానందాన్ని కలిగిస్తాయి. ఆ చేష్టలలోనూ, ఆ పలుకులలోనూ, ఆ నడకలలోనూ ఒక చిలిపితనమూ, విజ్ఞానహేతువు అయిన ఒకమాదిరి అజ్ఞానమూ, విస్పష్టంగా ద్యోతకమవుతూవుంటాయి,

శాంత నా మేనకోడలు.

నేను హాలులోని వాలుకుర్చీలో కూచుని, పేపరు చేతిలో పుచ్చుకొని అబీసీనియా ఆక్రమణ సంపూర్తిగా అయిపోయిన తర్వాత, ముస్సోలినికి నూతనంగా కావలసివచ్చిన కాలనీల విషయమై చదువుతున్నాను. యూరప్‌నంతా బెదిరిస్తున్న యిద్దరు డిక్టేటర్లలోనూ, ఒకడైన ఈ ముస్సోలిని మహాశయుడి గురించి దీర్ఘంగా ఆలోచిస్తూ అతను కోరుతున్న కాలనీల చారిత్రక విషయాలు తెలుసుకొందామనే కుతూహలంవల్ల అమితాసక్తితో పేపరు చదువుకుంటున్నాను. పానకంలో పుడకలా ప్రత్యక్షమయింది శాంత.

"మ్హామయ్యా !"

"ఊఁ"

వినిపించలేదు కాబోలు మళ్లీ కెట్టించింది. "మామయ్యా" అంటూ.

"ఊఁ," అన్నాను, ఓపికతో.

"మామయ్యోయ్!"

ఏమిటీ ఆర్భాటమన్నట్లు, మొహానికడ్డంగా ఉన్న పేపరు కొద్దిగా తొలిగించి, ఆమె నవ్వు మొహంవంక తీక్షణంగా చూశాను. అలాచూడడంలో నాఉద్దేశం: "నేను పేపరుఎంతో జాగ్రత్తగా చదువుకుంటున్నాను. ఇవన్నీ జాతీయ అంతర్జాతీయ విశేషాలు. నీకు అక్కర్లేనివి; నాకు అవసరమయినవి. నన్ను శ్రమపెట్టక నీదారిని నువ్వుపో. నన్ను ముస్సులో నిగుడించి సరిగా స్టడీ చెయ్యనియ్యి."

నాతీక్షణవీక్షణంలో యింత ఉద్దేశం ఉన్నా, ఆమె చాల తేలికగా, "ఓయ్, మామయ్యోయ్!" అంది, జొన్నగింజలలాటి పలువరుసా, సొట్టలు పడుతున్న చెక్కిళ్లూ, ఆమె సోయగాన్ని ద్విగుణీకృతం చేస్తూవుండగా.

నాకూ, ప్రపంచానికీ యిలాటి సందర్భాలలోనే పేచీవస్తుంది. ఏవిషయాన్ని అయితే నేను

ఎంతో సీరియస్‌గా తీసుకుంటానో, ఆవిషయాన్నే ప్రపంచం అంతచులకనగా చూస్తుంది.

"ఏం శాంతా!"

"ఏం చదువుతున్నావ్!"

ఏంచదువుతే తన కెందుకో?—తన కేమన్నా బోధపడుతుందా, ఏమన్నానా?

"చూడటం లేదూ?"

"చూస్తున్నాను, నాకు కళ్ళు ఉన్నాయి," అంటూ కళ్ళు మిటకరించింది.

ఆ మిటకరింపు చూసి నేను అప్రయత్నంగా చిరునవ్వు నవ్వాను.

"పేపరు...కనిపించడం లేదూ?"

"కనిపించకపోవడానికి! నల్లపూసా? నాలుగు తావులంత ఉన్న పేపరు నాకు కనిపించక పోవడ మేమిటి! చత్వారం ఉన్నవాళ్లకి కూడా కని పిస్తుంది!"

నాలుగుతావులంత ఉంది పేపరు! చత్వారం ఉన్నవాళ్ళకికూడా కనిపిస్తుంది!!

అంతవరకూ నుంచునివున్న శాంత ఒక పేము కుర్చీ నా వాలుకుర్చీకి పక్కగా లాక్కుని కూచుంది. రెండు నిముషాలపాటు ఏదో ఆలోచిస్తున్నదానిలా

నాలుగు గోడలూ పరిశీలించింది. ఇక నా చదువుకి అడ్డం తగలదుకదా అని నేను సంబరపడ్డాను. క్షణ కాలంలోనే ఆశ నిరాశ అయిపోయింది.

"పేపర్లో... ఏం ఉంటాయి మామయ్యా?"

ఏం ఉంటాయని చెప్పేది! ఏం ఉంటాయని చెప్తే ఆమెకి అర్థమవుతుంది! ఏమీ తోచక నిశ్శబ్దదేవత శరణుజొచ్చాను. కాని ఆమె ఊరుకుంటేనా?...

"అమ్మ రెండుపూట్లా కాఫీ ఎలామానలేదో, నేను బడికి వెళ్ళి బలపాలఆట ఆడడం ఎలా మానలేనో, అలాగే పేపరు చదవడంకూడా నువ్వు మానలేవు. జిలేబీ తింటే కడుపు నిండుతుంది. సినిమాకివెళ్తే బొమ్మలు చూడవచ్చు. కాని, పేపర్లో ఏం ఉంటాయి మామయ్యా?"

"అన్నీ ఉంటాయి."

"అన్నీ అంటే?"

"అన్నీనూ."

"అదిగో......"

"పేపర్లో ఎన్నో విశేషాలు ఉంటాయి."

"విశేషాలు అంటే?"

"సంగతులు."

"అవుతే, పేపరు నన్ను ఒకమారు చూడనీ."

నా చేతిలోని పేపరు తీసుకొని తలకిందుగా పుచ్చుకొంది. నేను చిన్నగా లోపల నవ్వుకొన్నాను. పైకి నవ్వితే చాలా హంగామా చేస్తుంది శాంత.

న్యూస్ పేపరులోని పేజీలు ఒక్కొక్కటే తిరగేస్తోంది. ఫొటోలు ఉన్న పేజీ పరిశీలిస్తోంది.

"ఈ ఫొటోల్లో ఉన్న మనుషులు తలకిందుగా ఉన్నారేమిటి ?"

"నువ్వు పేపరు తలకిందుగా పుచ్చుకొన్నావ్!"

"మరి, యిందాకట్నించీ చెప్పవేం, నన్ను ఎగతాళి చేసేందుకా ?"

చిన్నబుచ్చుకొన్న మొహంతో పేపరు సక్రమంగా పుచ్చుకొంది శాంత.

'నూతన దంపతులు' చూసి, "ఈదొర, దొరసాని ఎవరునాయనమ్మా?" అని ప్రశ్నించింది శాంత.

"వారికి ఈమధ్యనే సిమ్లాలో పెళ్ళి అయింది.

"పెళ్ళిఅయిన ప్రతివాళ్ళ ఫొటోలూ యిందులో ఉంటాయన్న మాట !"

"గొప్పవాళ్లింట్లో పెళ్లిళ్లు అయితే, ఆ పెళ్లి కొడుకూ పెళ్ళికూతురూ కలిసి తీయించుకొన్న ఫొటో యిందులో వేస్తారు."

"సీతకు పెళ్ళిఅయినప్పుడు నీ ఫొటో ఇందులో వేశారా?"

"లేదు"

"జానకిఅక్కయ్య ఫొటో, బావఫొటో వేశారా?"

"లేదు."

"మనం మోటారుకారుకూడా కొనుక్కున్నాం. మనం గొప్పవాళ్లం కాదూ?

"గొప్పవాళ్లమే! మనకంటె గొప్ప వాళ్లున్నారు"

"ఎవరు?"

"మనకి ఒక మోటారుకారు ఉంది. నాలుగు మోటారుకార్లు ఉన్నవారు మనకంటె గొప్ప వాళ్ళు కారూ?"

ఏదో కొత్తసంగతి తెలుసుకొన్న దానివలె, వేళ్ళుమడిచి లెక్కపెట్టుకుంటూ, "అవును, మామయ్యోయ్, అవును. ఒకటికంటె నాలుగు పెద్దది ఒకటికి మూడు కలుపుతే నాలుగు అవుతుంది."

గణితశాస్త్రంలో ఆమెకి ఉన్న ప్రవేశానికి నేను తృప్తిపడ్డాను.

"నేను పేపరు చదువుకుంటాను. నువ్వుపోయి సీతంపిన్నిగారి లక్ష్మితో ఆటలాడుకో."

"ఎండలో ఆటలాడుతే అమ్మ చావగొడుతుంది."

"నీడలో ఆడుకో."

"అయినా ఎప్పుడూ ఆటలేనా బాబూ! కాసేపు పేపరు చదువుకోనీ," అంటూ చిలిపితనంగా నావంక చూసింది. ఆముద్దుపలుకులకి నాకు తలవని తలంపుగా ఫక్కున నవ్వొచ్చింది.

శాంత పేజీలు తిరగేస్తోంది.

చిట్టచివరకి ఆ దృష్టి ముస్సులోని ఫొటో మీద పడింది. కొద్దిసేపు నిశ్చలంగా ఆ నియంతబొమ్మని పరకాయించిచూసింది.

"ఇతనెవరు, మామయ్యా ?"

"ముస్సులోని."

"మునలమ్మేమిటి ?"

"ము ... స్సు ... లో ... ని."

"ముస్సులోని. ఇతనేంచేస్తూ వుంటాడు. మా స్కూలుట్ మేష్టారిడస్ వేసుకొన్నాడు."

"ఇతను ఇటలీదేశానికి డిక్టేటర్."

"డిక్టేషన్ మేష్టారా ! డిక్టేషన్ చెప్తాడా?"

"డిక్టేషన్ మేష్టారు కాదు, డిక్టేటర్."

"అంటే?"

"నియంత."

"నియంత అంటే?

"డిక్టేటర్."

"డిక్టేటర్ అంటే?"

"నియంత."

"ఇదేమిటి? ఇది అంటే అది అంటావ్. అది అంటే యిది అంటావ్?"

"అవును, అంతే."

"అంతే?"

"ఊఁ, అంతే!"

"ఇదెక్కడి పేపరు బాబూ, ఏమీ అర్థమవడం లేదు. అంతాగొడవగా ఉంది," అంటూ పేపరు నా మొహాన పారేసి, తుర్రున తేనెటీగలా యింట్లోకి దూరింది.

పేపరు నలిపి, చింపి, ముక్కముక్కలుగా చేసేసి వేస్టుపేపరు బాస్కెట్‌కి వప్పగించకుండా, నాకు సమర్పించినందుకు వెయ్యి దేవుళ్ళకి మొక్కాను.

(జనవరి 1938)